



చేర్యాలలోని చిన్నిమల్లన్న మూలవిరాట్టు

ముస్తాబైన చిన్నిమల్లన్న ఆలయం

చేర్యాల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని చిన్నిమల్లన్న దేవాలయం ముస్తాబైంది. చిన్నిమల్లన్నను దర్శించుకున్న అనంతరం భక్తులు కొమురవెల్లి మల్లన్న వద్దకు వెళ్లేవారని పూర్వీకులు చెబుతుంటారు. మహాశివరాత్రి సందర్భంగా నేడు స్వామివారి మూలవిరాట్టుతో పాటు రేణుకా ఎల్లమ్మతల్లికి అభిషేకం, స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు చేయనున్నారు. మండలంలోని పలు గ్రామాలలోని శివాలయాలను ముస్తాబుచేశారు.

హిందువుల అత్యంత విశిష్ట పండుగల్లో శివరాత్రి ఒకటి...ఈ రోజును పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భక్తులు విశ్వసిస్తారు. శివరాత్రి రోజు భక్తులు ఉపవాసం దీక్ష బూని ప్రత్యేక పూజలు, అర్చనలు, జాగరణ చేస్తారు. అలాగే, రుద్రాభిషేకాలు, శివ కల్యాణాలు, జపాలు, స్తోత్రాలు, కీర్తనలు అఖండ దీపారాధనలు, బిల్వ దళార్చనలు నేటి ప్రత్యేకత. మృత్యుంజయుడైన శివుడిని పూజిస్తే మృత్యువు దరిచేరదని భక్తుల నమ్మకం. అందుకే ఈ మహాశివరాత్రి రోజు శివున్ని ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ మేరకు జిల్లాలోని శైవక్షేత్రాలు సర్వాంగ సుందరగా ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు. పూల, పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. పూజా సామగ్రి దుకాణాలు సైతం కిటకిటలాడాయి.



విద్యుద్దీపాల వెలుగుల్లో కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో సిద్దిపేటలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయంలోని నంది విగ్రహం)



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

మరకత లింగేశ్వరుడిని దర్శించుకోనున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని కాశీ మరకత లింగేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున రానుండటంతో అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరకత లింగేశ్వర స్వామి, సిద్దేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

మార్కెట్‌లో శివరాత్రి సందడి..

శివరాత్రి పర్వదినం సందర్భంగా హుస్నాబాద్ మార్కెట్‌లో సందడి నెలకొన్నది. పూజసామగ్రికి దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరారు. మట్టి దీపపు ప్రమిదలు జత రూ.60, చిన్న దీపాలు రూ.5 నుంచి రూ.30 చొప్పున విక్రయించారు. కందగడ్డ కిలో రూ.40, సంత్రాలు కిలో రూ.100, ద్రాక్ష కిలో రూ.80, ఐదు మొక్కజొన్న కంకులు రూ.60 చొప్పున విక్రయించారు.



సిద్ది పేటలో పండ్ల అమ్మకాలు

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

- పొట్లపల్లికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు
- నేడు హుస్నాబాద్ మరకత లింగేశ్వరుడిని దర్శించుకోనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- మార్కెట్‌లో పండ్లు, పూలకు ఫుల్ గిరాకీ
- రోజువారి కంటే ధరలు పైపైకి

భక్తుల కొంగు బంగారం పొట్లపల్లి క్షేత్రం

హుస్నాబాద్‌రూరల్, మార్చి 7: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వాంగసుందరంగా ముస్తాబైంది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో పి.కిషన్‌రావు తెలిపారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులకు అల్పాహారం అందించనున్నారు. భక్తుల కోసం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పొట్లపల్లిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యార్థం హుస్నాబాద్ ఆర్టీసీ బస్‌డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు. సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ జిల్లా కేంద్రం నుండి పొట్లపల్లికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లోని లింగాలకొండపై వెలసిన చంద్రమహేశ్వరస్వామి జాతర అత్యంత వైభవంగా జరగనున్నది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పందిల్లలోని మహాలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో రాజేశ్వరస్వామి క్షేత్రం



పెద్దపట్నం నిర్వహించే తోటబావి ప్రాంగణంలో ఏర్పాటు చేసిప బారికేడ్లు

నేడే మల్లన్నకు పెద్దపట్నం

కొమురవెల్లి : నేటి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శివరాత్రి సందర్భంగా స్వామివారికి గర్భాలయంలో మహన్యాస పూర్వక అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తోటబావి ప్రాంగణంలో యాదవ సాంప్రదాయం ప్రకారం ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పంచవర్ణాలతో పెద్దపట్నం వేసి స్వామివారికి కల్యాణం నిర్వహిస్తారు. ఆలయ పరిసరాలను స్వాగత తోరణాలతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. పెద్దపట్నం నిర్వహించే తోటబావి ప్రాంగణంలో బారికేడ్లతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ తెలిపారు.

ముస్తాబైన ఆలయాలు

దుబ్బాక/మిరుదొడ్డి : మహాశివరాత్రి ఉత్సవాలకు దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. దుబ్బాకలోని నీలకంఠ, ఉమామహేశ్వరాలయం, మార్కండేయ, చెల్లాపూర్‌లోని సోమేశ్వరాలయం, చౌదర్‌పల్లిలోని దుబ్బరాజరాజేశ్వరాలయం, కూడవెల్లిలోని రామలింగేశ్వరాలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సోమేశ్వరుని ఆలయానికి సరిహద్దు మండలమైన కరీంనగర్ జిల్లా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతారు. మిరుదొడ్డి మండలం చెప్యాల, అల్వాల, మోతే గ్రామాల్లోని రామలింగేశ్వరాలయాలు మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లను చేశారు. మోతెలోని రామలింగేశ్వరాలయం వద్ద తహసీల్దార్ జయంత్, తాజామాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట పురోహితుడు మనోహర్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి మమత పాల్గొన్నారు.



కూడవెల్లి రామలింగేశ్వర మూలవిరాట్

కూడవెల్లి రామలింగేశ్వరుడి ఆలయంలో..

అక్బర్‌పేట- భూంపల్లి : శివరాత్రి పర్వదినం సందర్భంగా కూడవెల్లి రామలింగేశ్వరాలయం ముస్తాబైంది. మూడునదుల సంగమంగా మాండవ్య నదిగా కూడలి(కూడవెల్లి)వాగులో శివరాత్రి పర్వదినం పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రాత్రి ఏడు గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.



రాయపోల్ మండలం రామారం శివాలయం

నేటి నుంచి రామారంలో..

రాయపోల్ : రాయపోల్ మండలం రామారంలో మహా శివరాత్రి సందర్భంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం పంచామృత రుద్రాభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తారు. శనివారం ఉదయం రుద్రహోమం అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, ఆదివారం ఉదయం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

సలేంద్రి రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



చిన్నకోడూరు: మండలంలోని సలేంద్రి రామలింగేశ్వర స్వామి (అక్కన్న, మాదన్నల కాలంలో నిర్మించిన అతిపురాతనమైన) ఆలయం ముస్తాబైంది. శుక్రవారం గణపతి పూజ, కల్యాణం, అభిషేకాలు, జాగరణ, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పానుగంటి నర్సింహాచారి తెలిపారు.



అష్టాదశ శక్తిపీఠసహిత ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం

ఉమా రామలింగేశ్వరాలయంలో

కొండపాక : దేశంలోనే మొదటిదిగా కొండపాక ఆనంద నిలయం ఆవరణలో వెలసిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం ఏడు గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం రాత్రి లింగోద్భవ సమయాన ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మల్లన్న ఆలయం ముస్తాబు



కొలువుదీరిన మల్లికార్జున స్వామి

జగదేవ్‌పూర్ : మహాశివరాత్రి వేడుకలకు జగదేవ్‌పూర్‌లోని మల్లన్న ఆలయం ముస్తాబైంది. గురువారం సాయంత్రం ఆలయం వద్ద ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం గంగ తెప్ప తీసుకువచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం పది గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం వేద పండితుల మధ్య నిర్వహించారన్నారు. దౌలాపూర్, కొండాపూర్, గొల్లపల్లి, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల శివ భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.

బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో..



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ

నారాయణరావుపేట : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ పార్వతీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి శివరాత్రి ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలే కాకుండా ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వయంభు లింగాన్ని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోదిల కిషన్ తెలిపారు.

రాంపూర్ కోటిలింగేశ్వరాలయంలో..



స్ఫటిక లింగం

తొగుట : శివరాత్రి ఉత్సవాలకు తొగుట మండలంలోని రాంపూర్ కోటిలింగేశ్వరాలయం ముస్తాబైంది. పార్థివలింగాభిషేకం, పార్వతీపరమేశ్వర కల్యాణం, దీపోత్సవం, పల్లకీసేవ, లింగోద్భావ కాలంలో ప్రత్యేక పూజలు, మరునాడు అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్ పంతులు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరాలయం

గజ్వేల్/దూల్మిట్ట/సిద్దిపేట అర్బన్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పార్థివేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. సిద్దిపేటలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. దూల్మిట్ట మండలం బెక్కల్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. ఆలయ పూజారి శివ, పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ.. అభిషేకాలు స్వామివారికి బోనాలు, పెద్దపట్నం, ఒగ్గుకథ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ధాన్యం బస్తాల దొంగలు అరెస్ట్

- బొలెరో వాహనం, ట్రాక్టర్ ట్రాలీ, రూ.1.40 లక్షల నగదు స్వాధీనం



నిందితులను చూపిస్తున్న పోలీసులు

కుకునూరుపల్లి, మార్చి 7: కల్లాల వద్ద ఉంచిన ధాన్యాన్ని రాత్రివేళ ఎత్తుకెళ్లి జల్సాలు చేస్తున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్ నిందితుల వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన పోతుల సుధాకర్, సున్నపు దేవేందర్, సాగనీ నవీన్ జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో దొంగతనాలు చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబెట్టి, తూర్పారబట్టి ధాన్యాన్ని బస్తాలలో నింపి అమ్ముకుందామనే సమయంలో బస్తాలు చోరికి గురయ్యేవి. వీరు దొంగిలించిన ధాన్యం బస్తాలను గజ్వేల్, సిద్దిపేట మార్కెట్‌లో అమ్మి జల్సాలు చేసుకునేవారు. గురువారం వెలికట్ట ఎక్స్‌రోడ్ వద్ద కుకునూరుపల్లి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బొలెరో వాహనంలో ఉన్న బస్తాలను చూసి గట్టిగా నిలదీయడంతో దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. జిల్లాలో 12 బస్తాలను, అలాగే ట్రాక్టర్ ట్రాలీని దొంగతనం చేశామన్నారు. వారి నుంచి బొలెరో వాహనం, ధాన్యం బస్తాలు, రూ.1.40 లక్షలు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపించామని సీఐ లతీఫ్ తెలిపారు.



మహిళలు మహారాణులు

- అధికారులు, ప్రజాప్రతినిధులుగా రాణింపు
- అన్ని రంగాల్లోనూ తమదైన గుర్తింపు
- జిల్లాలో కీలకపాత్ర పోషిస్తున్న అతివలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి7: సిద్దిపేట జిల్లా అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. సంఖ్యాపరంగా, ఓట్లవారీగా పురుషుల కన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉద్యోగులుగా రాణిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి జిల్లా ఉన్నతాధికారి స్థాయివరకు మహిళలే మహరాణులుగా వ్యవహరిస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కీలక స్థానాల్లో మహిళలు కొలువుదీరి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

మహిళల చేతుల్లోనే చట్టం.. న్యాయం

జిల్లాను పర్యవేక్షించే అతి కీలక బాధ్యతలు ఓ మహిళ చేతుల్లోనే ఉన్నాయి. జిల్లా పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ అనురాధ వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె తనదైన శైలిలో ముందుకెళ్తున్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్‌గా కీలక బాధ్యతల్లో ఉన్న జడ్జి స్వాతిరెడ్డి న్యాయసేవల గురించి జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా శ్రావణి, హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తిగా శివరంజని, గజ్వేల్ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జిగా సౌమ్య, జూనియర్ జడ్జిగా ప్రియాంక విధులు నిర్వహిస్తున్నారు. పారదర్శకమైన న్యాయసేవలను అందిస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో న్యాయవాదులుగా మహిళలు రాణిస్తున్నారు. అంతేగాకుండా పోలీసు శాఖలోనూ సుమారు 160 మంది సీఐలుగా, ఎస్ఐలుగా, హెడ్‌కానిస్టేబుళ్లుగా, కానిస్టేబుళ్లుగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అధికారులు.. ప్రజాప్రతినిధులుగా

జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా వేలేటి రోజాశర్మ ఎంపికై ఐదేళ్లు కావొస్తున్నది. ఇక జిల్లాలో 13 మంది జడ్పీటీసీలు, 13 మంది ఎంపీపీలు, 120 మందికిపైగా ఎంపీటీసీలు మహిళలే. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో నాలుగు చోట్లా మహిళలే చైర్‌పర్సన్‌లుగా ఉన్నారు. సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కడవేర్గు మంజుల, దుబ్బాక చైర్‌పర్సన్‌గా గన్నె వనిత, హుస్నాబాద్ చైర్‌పర్సన్‌గా ఆకుల రజిత, చేర్యాల చైర్‌పర్సన్‌గా అంకుగారి స్వరూపరాణి ఉండడం విశేషం. ఇక పల్లెలు, పట్టణాలతోపాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వామ్యమైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఐఏఎస్ అధికారిగా తనదైన ముద్ర వేస్తున్నారు. అదే విధంగా డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా పంచాయతీ అధికారి దేవకి, డీఎస్‌వో తనూజశ్రీ, స్త్రీ,శిశు సంక్షేమ అధికారి సావిత్రి, హార్టికల్చర్ జిల్లా అధికారి సునీత, ఎస్సీ వెల్ఫేర్ అధికారి కవిత, బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజన, సహకార శాఖ అధికారి కరుణ, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణితోపాటు పలువురు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు సుమారు 300 మందికిపైగా కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు.

విద్యా, వైద్యం రంగాల్లోనూ..


ఆకాశమే హద్దుగా అన్ని రంగాలను శాసిస్తున్న మహిళలు కీలకమైన విద్యా, వైద్య రంగాల్లోనూ తగిన గుర్తింపు పొందుతున్నారు. జిల్లాలో సుమారు 2వేల మందికిపైగా మహిళా ప్రభుత్వ టీచర్లు నిత్యం విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలోనూ మహిళా టీచర్ల శాతమే ఎక్కువ. ఇక 1150 అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలే చిన్నారులకు విద్యాబుద్ధులను నేర్పిస్తున్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో మహిళలదే కీలక పాత్ర అని చెప్పడం నిస్సందేహమే. వైద్యారోగ్య శాఖలోనూ మహిళలదే పైచేయి కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య స్పృహ కల్పించే 850 ఆశా కార్యకర్తలు మహిళలే. అదే విధంగా 1100 మందికిపైగా ఏఎన్ఎంలు, నర్సులు వైద్యసేవలందిస్తుండగా 100 మందికిపైగా మహిళా డాక్టర్లు ప్రభుత్వ దవాఖానాల్లో కీలకంగా మారారు.



ఆకర్షణలకు లొంగితే భవిష్యత్తు ప్రశ్నార్థకం

యుక్త వయసులో అమ్మాయిలు చాలా ధృడనిశ్చయంతో ఉండాలి. చిన్నచిన్న ఆకర్షణలకు లొంగిపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకెళ్లాలి. ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఉన్నతస్థాయికి ఎదిగిన మహిళలను ఆదర్శంగా తీసుకోవాలి. నేటి సమాజంలో మహిళలకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. వీటిని అందిపుచ్చుకునేలా శ్రమించాలి.

- డాక్టర్ అనురాధ, పోలీస్ కమిషనర్





ఆర్థిక సాధికారత సాధించాలి

చిన్నతనం నుంచే అమ్మాయిల్లో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు. స్వతంత్రంగా రాణించే విధంగా ముందుకెళ్లాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎన్నో ఉద్యోగవకాశాలు ఉన్నాయి. ఆర్థిక సాధికారత సాధించే దిశగా మహిళలు ఆలోచించాలి.

- గరీమా అగ్రవాల్, అదనపు కలెక్టర్

ఎంసీహెచ్, న్యూట్రిషన్ కిట్ల కథ కంచికే!

- సంగారెడ్డి జిల్లాలో రెండు పథకాల కిట్లకు కటకట
- ఎంసీహెచ్‌తో పాటు ప్రధాన ఆస్పత్రుల్లో కొరత
- నెలరోజులుగా సరఫరా నిలిచిపోవడంతో అనుమానాలు
- ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువు
- ఆ కిట్ల గురించి అడగొద్దంటూ మౌఖిక ఆదేశాలు?


ఎంసీహెచ్ కిట్


న్యూట్రిషన్ కిట్

సంగారెడ్డి అర్బన్, మార్చి 7: మాతా శిశు సంరక్షణ కోసం అప్పటి సర్కారు ప్రవేశ పెట్టిన రెండు పథకాలు ఇక నిలిచిపోనున్నాయా? అంటే వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి అవుననే సమాధానం వినిపిస్తున్నది. 2017 జూన్ 4 నుంచి ఎంసీహెచ్ కిట్ పథకం ప్రవేశ పెట్టగా, 2023 జూన్ 14న న్యూట్రిషన్ కిట్ పథకాన్ని అమలు చేస్తున్నారు. సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రధాన ఆస్పత్రుల్లో నెలరోజులుగా ఎంసీహెచ్‌తో పాటు న్యూట్రిషన్ కిట్ల కొరత ఏర్పడింది. పై నుంచి సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో ఆ రెండు పథకాల కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నగదు లేదు.. కిట్లు లేవు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్న ఉద్దేశంతో ఎంసీహెచ్ కిట్‌ను అమలు చేయగా, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో న్యూటిషన్ కిట్‌ను అందించే కార్యక్రమాన్ని అప్పటి సర్కారు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఎంసీహెచ్ కిట్‌తో పాటు ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగ శిశువు జన్మిస్తే రూ.12 వేల ప్రోత్సాహక నగదును నాలుగు విడతల్లో ఖాతాలో జమ చేసేది. ఇప్పటికే ఆ పథకం కింద నగదు జమ మూడేళ్లుగా నిలిచిపోగా, సంగారెడ్డి జిల్లాలో రూ.35 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ఎంసీహెచ్ కిట్‌తో పాటు న్యూట్రిషన్ కిట్ల సరఫరా, పంపిణీ నిలిచిపోవడంతో గర్భిణులు, బాలింతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. నగదుతో పాటు కిట్లు రాకపోవడంతో పేద కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. రెండు పథకాలు మంచి ఫలితాలనిస్తున్నా.. ప్రభుత్వం మారడంతో అటు కిట్లు, ఇటు నగదు రెండు నిలిచిపోయి గర్భిణులు, బాలింతలు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో వేల మంది లబ్ధిదారులకు ఎదురుచూపులే దిక్కయ్యాయి.

ఆ పథకాలకు రాం..రాం?

ఎంసీహెచ్, న్యూట్రిషన్ కిట్ పథకాల అమలు కథ కంచికేనన్న చర్చ ఆరోగ్యశాఖ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాలో ఆ రెండు కిట్ల కొరత ఏర్పడడంతో జిల్లా వైద్య అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సరఫరాపై వారి నుంచి స్పందన లేదని ఓ అధికారి తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కారు అమలుచేసిన పథకం కాబట్టి, కాంగ్రెస్ సర్కారు కొనసాగింపుపై అనుమానాలున్నాయని చెప్పినట్టు సమాచారం. ఆ కిట్ల గురించి అడగడం, మాట్లాడడం కానీ చేయకపోతే మంచిదన్న అభిప్రాయాన్ని జిల్లా వైద్యాధికారులకు ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది.

తేలని వావిలాల పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాసం

- కోర్టు ఆదేశంతో ఫలితం వెల్లడించని అధికారులు


అవిశ్వాస సమావేశంలో డైరెక్టర్లు, అధికారులు

జిన్నారం, మార్చి 7: వావిలాల పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానంపై గురువారం అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన పలువురు పీఏసీఎస్ డైరెక్టర్లు చైర్మన్ శంకర్‌రెడ్డి(బీఆర్ఎస్)పై అవిశ్వాస నోటీసు అందజేయగా.. గురువారం సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పీఏసీఎస్ సంస్థ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని జరిపారు. మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా.. సమావేశానికి 8 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యుల పేర్లు, సంతకాలను అధికారులు సేకరించి, సమావేశ వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా అవిశ్వాసంపై కోర్టు ఆదేశాల కారణంగా ఎలాంటి ప్రకటన చేయరాదని, వివరాలను న్యాయస్థానానికి అందజేస్తామని అధికారులు తెలిపారు. ఇక అవిశ్వాస ప్రతిపాదన నెగ్గాలంటే తొమ్మిది సభ్యులు అవసరం ఉండగా.. 8 మంది హాజరు కావడంతో అధికారుల ప్రకటనపై ఉత్కంఠ నెలకొన్నది. ఈనెల15న అవిశ్వాస సమావేశం ఫలితం వెల్లడించే అవకాశమున్నది.

ట్యాంకర్లతో వంతుల వారీగా నీటి సరఫరా


ఎంపీడీవో కార్యాలయానికి నీటిని అందిస్తున్న ధర్మారం జీపీ ట్యాంకర్

మద్దూరు, మార్చి 7 : మద్దూరు మండల పరిషత్ కార్యాలయానికి మిషన్ భగీరథ నీళ్లు మూడు మాసాలకు పైగా రావడంలేదు. దీని కారణంగా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీలు వంతుల వారీగా ట్యాంకర్లతో నీళ్లందిస్తే తప్ప, కార్యక్రమాలు సాఫీగా సాగని దుస్థితి. ఇంత జరుగుతున్నా పాలకులకు, అధికారులకు పట్టకపోవడం శోచనీయం. ఇటీవల నిర్వహిస్తున్న ఉపాధిహామీ సోషల్ ఆడిట్ మూలంగా పదిహేను రోజులుగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఎంపీడీవో కార్యాలయంలోనే ఉంటున్నారు. దీని గురించి మిషన్‌భగీరథ అధికారులకు చెప్పుకోలేని పరిస్థితి ఉంది. రాజభవనాన్ని తలపించే ఎంపీడీవో కార్యాలయానికి ప్రత్యేకంగా బోరు లేకపోవడం విడ్డూరం. కార్యాలయం పక్కనే ప్రాథమిక పాఠశాల నిర్మాణం కోసం అప్పట్లో బోరు వేశారు. ఈ బోరు నీటినే కస్తూర్బా పాఠశాల నిర్మాణానికి కాంట్రాక్టర్ మోటారు బిగించి వాడుకున్నాడు. ఆ తర్వాత బోరును వాడకోకుండా వదిలేశారు. ఎంపీడీవో కార్యాలయాధికారులు బోరుకు మోటారు అమర్చి నీటిని వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ విధంగా చర్యలు తీసుకోవడం లేదు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

- మెదక్ ఎస్పీ డా.బాలస్వామి
- మహిళల సంక్షేమమే ధ్యేయంగా నూతన చట్టాలు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా ఎస్పీ డా.బాలస్వామి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తమ ప్రతిభను, సత్తాను చాటుకోవాలని సూచించారు. మహిళలు ప్రశ్నించేతత్వం కూడా అలవర్చుకోవాలన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లోనూ మహిళలు నేడు పురోభివృద్ధి సాధించి పురుషులతో సమానంగా పని చేస్తూ.. తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపారు. అంతకుముందు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం అనేక నూతన చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. మహిళా సంఘ సమావేశాల ద్వారా వారికి అవగాహన కల్పిస్తూ.. ఆర్థికంగా స్వావలంభన దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితోనే మహిళా సాధిరాకత సాధించగలరన్నారు. జిల్లాలోని మహిళా ఉద్యోగులను శాలువా మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయలక్ష్మి, కరుణ, బ్రహ్మాజీ, ఇందిరా, స్వరూప, మెడికల్ ఫోరం కార్యదర్శి మంజుల, మెప్మా సునీత, జిల్లాలోని మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించినప్పుడే అన్నిరంగాల్లో సమానంగా దూసుకెళ్తారని పేర్కొన్నారు. అలాగే భరోసా సెంటర్‌లో జిల్లా మహిళా సిబ్బందితో కలిసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమాలో అదనపు ఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి

చిన్నశంకరంపేట, మార్చి 7: గుర్తు తెలియని వాహనం ఢీకొని యచకురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అంబాజీపేట శివారు మెదక్-చేగుంట రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన లక్ష్మి(50) మతిస్థిమితం లేక రోడ్డుపై తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవిస్తున్నది. కాగా గురువారం దుర్గామాత ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

58.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మునిపల్లి, మార్చి 7: మునిపల్లి, సదాశివపేట మండలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 58.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు మునిపల్లి మండలం కంకోల్ గ్రామంలో బి.సంతోష్‌కుమార్ (వ్యాపారి) తన దుకాణంలో 9.30 క్వింటాళ్లు, సదాశివపేట పట్టణం బసవేశ్వరవాడకు చెందిన మ్యాదం మల్లేశం(వ్యాపారి) తన గోదాంలో నిల్వ ఉంచిన 49 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బియ్యాన్ని మునిపల్లి, సదాశివపేట పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

'ఎర్నింగ్ ఫర్ కిలో మీటర్' కలెక్షన్‌లో ఖేడ్ అగ్రస్థానం


మంత్రి పొన్నం ప్రభాకర్‌చే సన్మానం పొందిన ఆర్టీసీ కార్మికులు

నారాయణఖేడ్, మార్చి 7: ఇటీవల నిర్వహించిన మేడారం జాతరకు ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులను పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి పంపిన బస్సుల్లో ఖేడ్ ఆర్టీసీ డిపో బస్సులు 'ఎర్నింగ్ ఫర్ కిలో మీటర్' అత్యధికంగా కలెక్షన్లు సాధించి, రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచాయని డీఎం మల్లేశయ్య తెలిపారు. అత్యధిక ఈకేపీ సాధించిన డ్రైవర్లు బీఎస్.రెడ్డి, మల్కయ్య, కలెక్షన్ తీసుకొచ్చిన కండక్టర్ నర్సింహులను హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శాలువాతో సన్మానించి, నగదు రివార్డు అందజేశారు. వారిని ఆర్ఎం.ప్రభులత, డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం, డీఎం మల్లేశయ్య అభినందించారు.

'ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

వెల్దుర్తి, మార్చి 7: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జగదీశ్వరచారి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించగా, కొందరు లబ్ధి పొందలేకపోయారని, దీంతో దరఖాస్తుల్లో సవరణ కోసం ప్రభుత్వం మరోసారి అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహాలక్ష్మి పథకంలో గ్యాస్ సబ్సిడీ, గృహలక్ష్మి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందని అర్హులందరూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 170 దరఖాస్తులు రాగా సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు.

15 నుంచి ఒంటిపూట బడులు: డీఈవో

సంగారెడ్డి అర్బన్, మార్చి 7: సంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈనెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 23వ తేదీవరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటి పూటల సమయంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ ఆదేశాలు పాటించాలని సూచించారు.

'రాచన్నస్వామి జాతరను విజయవంతం చేయాలి'

కోహీర్, మార్చి 7: కోహీర్ మండలం బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయంలో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే స్వామివారి జాతరను విజయవంతం చేయాలని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. గురువారం రాచన్నస్వామి ఆలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. తహసీల్దార్ బాలశంకర్, ఎస్ఐ కృష్ణయ్య, నాయకులు దయానంద్‌పాటిల్, శ్రీపాల్, గోపాల్, ప్రభాకర్, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

సర్వమత సన్నిధి వట్‌పల్లి వెంకట ఖ్వాజా దర్గా

- రేపటి నుంచి ఉర్సు


ముస్తాబైన వెంకట ఖ్వాజాదర్గా, ఆశ్రమం

వట్‌పల్లి, మార్చి 7: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వట్‌పల్లి వెంకట ఖ్వాజా దర్గా(ఆశ్రమ) 37వ ఉర్సును ఈనెల 9 నుంచి నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలకు రాష్ట్రానికి చెందిన భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వేలాదిమంది భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం ప్రభుత్వం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసింది. 9న గంధం సమర్పణ, అభిషేకం, పుష్పార్చన, ఖవ్వాలీ 11న సమాప్త ఆరాధన ఖురాన్ గ్రంథ పఠన, ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నదానం, మంచినీటి వసతి ఏర్పాటు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- డీఈవో రాధాకిషన్


పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లపై పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

చేగుంట, మార్చి 7: ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈవో రాధాకిషన్ పాఠశాల యాజమాన్యానికి సూచించారు. గురువారం చేగుంట మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రమైన దీప్తి విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా ప్రైవేట్ పాఠశాల ఉండాలని కరస్పాండెంట్ కృపావరం, ప్రిన్సిపాల్ దీప్తికి సూచించారు. పరీక్షా కేంద్రంలో ట్యూబ్ లైట్, ఫ్యాన్లు, నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. పదో తరగతి పరీక్ష విధులు నిర్వర్తించే సిబ్బందికి సహకరించాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, దీప్తి విద్యాలయ ఉపాధ్యాయులు స్టీవీనా, సుభాష్‌గౌడ్, నర్సింహులు, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి


కౌడిపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో చందునాయక్

కౌడిపల్లి, మార్చి 7: రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని మెదక్ జిల్లా డీఎంహెచ్‌వో చందునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లావ్యాప్తంగా ఇద్దరు రోగులకు క్యాన్సర్ వచ్చినట్లు గుర్తించి ప్రత్యేకంగా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గొంతు, కాలేయ, రొమ్ము క్యాన్సర్లు వస్తున్నాయని, రోగాల బారినపడకుండా వైద్యులు ఇచ్చే సూచనలు పాటించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళల కోసం పది మహిళా క్లినిక్‌లు ఉన్నాయని, దీనిద్వారా మహిళలకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫర్నాజ్, ఎంపీహెచ్‌వో సురేందర్, శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎం మజీద పాల్గొన్నారు.

ఉపాధిహామీ యాక్షన్‌ప్లాన్

- 2024-25 సంవత్సరంలో 42 లక్షల పని దినాలే లక్ష్యం
- 100 రోజుల పనిని పూర్తిచేసుకున్న కుటుంబాలు పదివేల పైగానే
- పనుల గుర్తింపునకు గ్రామసభలు పూర్తి


నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 7: ఉపాధిహామీ పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. సిద్దిపేట జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సర కూలీల బడ్జెట్ రూపకల్పనలో భాగంగా 489 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి పనులను గుర్తించారు. ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీల్లో కేంద్రం పూర్తిగా నిఘా పెంచింది. ఇప్పటికే నేషనల్ ఇన్‌ఫార్మెటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు వారి ఖాతాలో నేరుగా కూలీ డబ్బులను జమచేస్తున్నది.

జిల్లాలో 2.37 లక్షల మందికి పైగా కూలీలు

సిద్దిపేట జిల్లాలో 499 గ్రామపంచాయతీ ఉండగా.. అందులో ముంపు గ్రామాలు పోను 489 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 1.36 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 2.37 లక్షల మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. దాదాపు జిల్లాలో వంద రోజులు పనిని పూర్తి చేసుకున్న కుటుంబాలు పదివేల పైగా ఉన్నాయి. ఉపాధి పనుల్లో గరిష్ఠంగా రూ.272 చెల్లిస్తున్నారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 42 లక్షల పని దినాలను అధికారులు గ్రామసభలు పెట్టి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పనుల తీర్మానాలు ఇవే

త్వరలోనే ఉపాధిహామీ ఆర్థిక సంవత్సరం ముగియనున్నది. కొత్త ఆర్థిక సంవత్సర లక్ష్యం కోసం అధికారులు గ్రామసభలు నిర్వహించి 20కి పైగానే పనులకు తీర్మానాలు చేశారు. స్టోరేజ్ ట్యాంకులు, పొంపాడ్స్, షెడ్స్, చిన్న, పెద్ద నీటి కుంటలు, భూమి అభివృద్ధి పనులు, పంట పొలాలకు అనుసంధాన రోడ్ల పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాకుండా పాడుబడిన బావులను పూడ్చడం, బావులను పూడిక తీయడం, కొత్త బావులను నిర్మించుకోవడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, కంచెల నిర్మాణాలు, మొక్కలకు నీరు పోసే పనులకు గ్రామసభల్లో తీర్మానాలు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, వారిని ప్రతిఒక్కరూ గౌరవించాలని అధికారులు అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మహిళా సిబ్బందిని సత్కరించారు. మహిళలు వివిధ రంగాల్లో అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థినీలకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ములుగు, మార్చి 7: ఎంపీడీవో కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో ఎంపీడీఓ పీవీఆర్‌కే శర్మ ఎంపీపీ లావణ్యతో పాటు పంచాయతీ మహిళా కార్యదర్శులను శాలువాతో సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీవో నరసింహారావు, సూపరింటెండెంట్ రామచంద్ర రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** మిరుదొడ్డి గ్రామపంచాయతీలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సఫాయి కార్మికులను ఎంపీడీవో గణేష్‌రెడ్డి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో జహిరోద్దిన్, పంచాయతీ కార్యదర్శి ఫహీం పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని దుద్దెడ గ్రామపంచాయతీలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి మహిళా సిబ్బంది, ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బాలాజీ, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్, ఉప సర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** మండలంలోని గాంధీనగర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలో ఉన్న మహిళలను ఎంపీపీ మానస శాలువాలతో సత్కరించారు. మండలంలోని పందిల్ల గ్రామ పంచాయతీలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలతో పాటు మండలంలోని ఆకునూరు గ్రామంలో ఉల్లెంగల సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉల్లెంగల సేవాట్రస్ట్ నిర్వాహకులు ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య, మహిళ, డ్వాక్రాసంఘాల సభ్యులను శాలువాకప్పి సత్కరించారు. పంచతంత్ర పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆటలపోటీలు నిర్వహించారు.



మిరుదొడ్డిలో సఫాయి కార్మికులను శాలువతో సన్మానిస్తున్న ఎంపీడీవో



చేర్యాల పంచతంత్ర పాఠశాలలో నిర్వహించిన పోటీలో విద్యార్థినుల మాతృమూర్తులు

● **చిన్నకోడూరు:** మండలంలోని రాముని పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, ఉపాధ్యాయినీలు వనజ, ఉమారాణిని, మధ్యాహ్న భోజన కార్మికురాలు వినోద, మంజుల, స్కావెంజరు పద్మను పాఠశాల ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖరశర్మ, బాలకృష్ణరెడ్డి ,తిరుపతి, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట అర్బన్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని వికాస్ హై స్కూల్‌లో మహిళ ఉపాధ్యాయులకు, విద్యార్థినీలకు క్రీడా పోటీలను సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి తదితరులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో వివోఏలు కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. మండలంలోని దాచారం గ్రామంలో ఎంపీటీసీ కొలిపాక రాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీటీసీ కనగండ్ల కవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళలను శాలువాలతో సన్మానించారు.

చికిత్సపొందుతూ యువతి మృతి



మానస(ఫైల్)

మిరుదొడ్డి, మార్చి7: పురుగుల మందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మిరుదొడ్డి మండలం అందెలో గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దండ బోయిన మానస(19) అనే యువతి నెల 5న కడుపు నొప్పిని భరించలేక పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

కొండపాక, మార్చి 7 : కొండపాకలో తాళం వేసిన ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోరమైన బాల మల్లు, కొమ్మురాజు, బర్రె రాముల, జంజీరపు నర్సింలుల ఇంటి తాళాలు పగుల కొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు నగదు, బంగారు నగలను అపహరించారు. బాలమల్లు ఇంట్లో 30 వేల నగదు తో పాటు 40,000 విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ నాలుగిళ్లలో సుమారు రెండు లక్షల రూపాయల విలువైన నగదు, ఆభరణాలను అపహరించారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

గజ్వేల్ ఏసీపీగా భాధ్యతలు చేపట్టిన పురుషోత్తంరెడ్డి



సీపీ అనురాధకు మెక్కను అందజేస్తున్నఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, మార్చి 7: గజ్వేల్ ఏసీపీగా కె.పురుషోత్తంరెడ్డి గురువారం బాధ్యతలను చేపట్టారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఏసీపీ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టిన అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయనను అభినందించారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల సరఫరా, రవాణాపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● **మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్**

అక్కన్నపేట, మార్చి 7: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ కోరారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి సభకు భారీగా తరలిరావలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

మద్దూరు, మార్చి 7 : ఈ నెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ క్రీడాకారులు వెళ్లనున్నారు. వారికి బీఆర్ఎస్ మద్దూరు మండలపార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ రూ.10వేల విలువ చేసే క్రీడాదుస్తుల్ని సీనియర్ క్రీడాకారుడు మహమ్మద్ అన్వర్ చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు మంచి ప్రతిభ కనబర్చి పేరుతీసుకు రావాలని వారు సూచించారు. కార్యక్రమంలో మద్దూరు హ్యాండ్‌బాల్ కోచ్ దామెర మల్లేశం, సభ్యులు మహమ్మద్ అన్వర్, బూరుగు నర్సింహులు, ప్రిన్సిపాల్ వెంకన్న, పీడీ దామెర ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, చేతన్, కార్తీక్ పాల్గొన్నారు.

భారీగా వెలిసిన పండ్ల దుకాణాలు

చేర్యాల, మార్చి 7 : మహాశివరాత్రి సందర్భంగా చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తా, పాత బస్టాండు, గాంధీ చౌరస్తా, వీరభద్ర కళామందిర్ సమీపంలో పండ్ల దుకాణాలు భారీగా వెలిశాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఆహారం మానేసి ఒక్కపొద్దుతో జాగరణ చేస్తారు. సాయంత్రం పండ్లు, కంద గడ్డలు ప్రతీ కుటుంబం కొనుగోలు చేయనుండడంతో పండ్ల వ్యాపారం జోరుగా సాగనుంది.

అక్రమ నిర్మాణాల ఫిర్యాదులపై అధికారుల విచారణ

సిద్దిపేట అర్బన్, మార్చు 7: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని కొన్ని నిర్మాణాలకు అనుమతులు లేవని ఆరోపిస్తూ, అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్, సిద్దిపేటకు చెందిన కొండలవాడి సతీష్ ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రావు గురువారం గ్రామంలో విచారణ జరిపారు. అనంతరం సంబంధిత వ్యక్తులు, అధికారులను పిలిచి వాంగ్మూలం తీసుకున్నారు. సంబంధిత పత్రాలు, వాంగ్మూలంపై సుడా కార్యాలయంలో విచారణ జరిపి, డీపీఓను పంపించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తదుపరి విషయాలను వెల్లడిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు



గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

అన్ని అనుమతులు ఉన్నాయి

గ్రామంలో నేను నిర్మాణం చేపట్టిన భవనానికి సంబంధించి వచ్చిన ఆరోపణలు అవాస్తవం. నాకు అన్ని అనుమతులు ఉన్నాయి. భవన నిర్మాణానికి సంబంధించి 2023 జనవరిలోనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాను.

-ప్రవీణ్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్

విచారణ జరిపి అనుమతి కాపీ ఇవ్వాలి

గ్రామ పరిధిలోని 59 జీవో మెరుపుగుట్ట, దారగుట్ట అక్రమ తవ్వకాలు, గ్రామంలోని అనుమతులు లేని నిర్మాణాలపై మేము ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి విచారణ కాపీని మాకు అందజేయాలి.

-చింతల శ్రీనివాస్ పీఏసీఎస్ చైర్మన్

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ ధ్యేయం

● **డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**



చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, మార్చి 7: బీఆర్ఎస్ పాలనలో విచ్ఛిన్నమైన పరిపాలనను సేవకులుగా ప్రజలకు చేరువచేసి, అన్నిరంగాలలో అభివృద్ధిసాధించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల, దొమ్మాట గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వంచన పాలన చేపట్టిన బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం నేర్పినా పలువురు నేతలు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని, ప్రతీ పేదింటికి అభివృద్ధిఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, నాయకులు కొమ్ము రవి, ముస్త్యాల యాదగిరి, పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

చిన్నకోడూరు, మార్చి 7: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ సూచించారు. గురువారం చిన్నకోడూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నకోడూరు నుంచి కిష్టాపూర్ వరకు ఉన్న రెండు లైన్‌ల రోడ్డును నాలుగు లైన్‌ల రోడ్డుగా విస్తరించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్శరాం, రాజు, జయంత్, గణేష్, రాజేందర్, ఎల్లయ్య, గణేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.



చిన్నకోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతన్న కాంగ్రెస్ నాయకులు

జాతీయ సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మద్దూరు, మార్చి 7 : మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన గుడిసె స్వర్ణ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో ఇండియన్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 52వ సీనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున పాల్గొని, ప్రతిభ కనపర్చడంతో దాద్రనగర్ హవేలీలో ఈ నెల 16 నుంచి 20 వరకు హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్ మహిళా పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయబాబు తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

● **మిరుదొడ్డి ఎంఈవో ప్రభుదాస్**



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మిరుదొడ్డి,మార్చి7: విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా మంచిఫలితాలను సాధించవచ్చునని మిరుదొడ్డి ఎంఈవో ప్రభుదాస్ అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు భూమి పూజ

ములుగు, మార్చి 7: గ్రామాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నాసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ములుగు మండలం అన్నాసాగర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద 5 లక్షలు రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేసి నిరూపించారన్నారు. ఇచ్చిన మాట కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

నంగునూరు, మార్చి 7: నంగునూరు మండలం అక్కెనపల్లి పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అక్కెనపల్లి పెద్దవాగు నుంచి ఇసుక తరలింపుపై 'ఇసుకాసురులు' అనే కథనాన్ని ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందనగా పోలీసులు దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతి లేకుండా తీసుకున్న తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

'ఎండిన పంటలను సర్వే చేసి పరిహారం అందించాలి'

హుస్నాబాద్ టౌన్, మార్చి 7 : హుస్నాబాద్ ప్రాంతంలో తీవ్రమైన ఎండలతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయాయని కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఎండిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ. 30 వేల నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లాలో 96 శాతం వినియోగదారులకు గృహజ్యోతి

● **ట్రాన్స్‌కో ఎస్ఈ మోహన్‌రెడ్డి**

హుస్నాబాద్, మార్చి 7: జిల్లాలో 96 శాతం మంది విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం అమలవుతున్నదని ట్రాన్స్‌కో ఎస్ఈ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గృహజ్యోతి కింద మార్చి నెల నుంచి జీరో బిల్లు ఇస్తున్నామన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారికి, మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు హుస్నాబాద్ పట్టణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సమావేశంలో హుస్నాబాద్ ఏడీఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

సిద్దిపేట టాస్క్‌ఫోర్క్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రవీందర్



సీపీ అనూరాధకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టాస్క్‌ఫోర్క్ ఏసీపీ రవీందర్

సిద్దిపేట క్రైం, మార్చి 7 : సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా బి.రవీందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అభినందించి గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 7: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి 9 వరకు జరిగే శివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లను, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైనట్లు ఏర్పాటు చేయాలని ఆలయ ఈవోకు సూచించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు కొనసాగనున్నట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. లింగోద్భావన సమయంలో భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరుకానున్నందున తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాల నిఘాలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.



అధికారులను సన్మానించిన ఆలయ ఈవో

ఈ సందర్భంగా ఆలయ ఈవో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు మార్క చంద్రయ్య, కర్ర రవీందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, గాజు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

● **సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్**

కొండపాక, మార్చి 7: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం, ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణాకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.



సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, మార్చి 7: విద్యార్థులు సైబర్‌నేరాలతో పాటు అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. చేర్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ తదితర అంశాలపట్ల షీటీమ్స్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్, షీటీమ్ బృందం సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా మల్లేశం



నియామకపత్రాన్ని అందుకుంటున్న తిప్పారపు మల్లేశం

బెజ్జంకి, మార్చి 7: కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన తిప్పారపు మల్లేశం నియమితులయ్యారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశానుసారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిప్పారపు మల్లేశం మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



మహిళా దినోత్సవం సందర్భంగా టీచర్లను సన్మానించిన ఇందిరా నగర్ పాఠశాల విద్యార్థులు

-సిద్దిపేట టౌన్